నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, ఆదివారం 4 ఆగస్టు 2024 | PEDDAPALLI

మ్యుటేషన్‌కు రూ.50 వేలు.. పహాణీకి రూ.10 వేలు

- రైతుకు తహసీల్దార్ నుంచి వేధింపులు • లంచం ఇచ్చినా కాని పని
- ప్రజావాణిలో దరఖాస్తుతో మ్యుటేషన్ పూర్తి • తాజాగా పహాణీ కోసం మళ్లీ లంచం డిమాండ్• ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రైతు వద్ద తీసుకుంటుండగా పట్టుబడ్డ తహసీల్దార్, డ్రైవర్, ప్రైవేట్ వ్యక్తి

గతంలో భూమి మ్యుటేషన్ కోసం ఆ తహసీల్దార్‌కు అడిగినంత ముట్టజెప్పాడు. అయినా పని కాకపోవడంతో కలెక్టరేట్‌కు ప్రజావాణిలో వెళ్లి దరఖాస్తు ఇవ్వడంతో మ్యుటేషన్ పూర్తయి, పట్టా పాస్‌బుక్ వచ్చింది. తాజాగా, పహాణీ నకల్ అవసరమైన రైతు మళ్లీ సదరు తహసీల్దార్‌ను సంప్రదిస్తే ₹10 వేలు ఇస్తేనే పనవుతుందని చెప్పడంతో చేసేదేమీ లేక ఏసీబీని ఆశ్రయించాడు. ఈ క్రమంలో సదరు రైతు వద్ద ₹10 వేలు లంచం తీసుకుంటుండగా కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్‌తో పాటు ఆయన డ్రైవర్, ప్రైవేటు వ్యక్తిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ జాహెద్‌పాషా, డ్రైవర్, ప్రైవేట్ వ్యక్తి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 3 : కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఓదెల మండలంలోని కొమిరెకు చెందిన కాడం తిరుపతి, ఆయన తండ్రి మల్లయ్య ప్రస్తుతం మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఉంటున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పందిల్ల గ్రామ శివారులోని సర్వేనెంబర్ 645లో 28 గుంటల వ్యవసాయ భూమి ఉంది. దీనికి సంబంధించిన మ్యుటేషన్ పెండింగ్‌లో ఉండగా, పట్టాదార్ పాస్ పుస్తకం కోసం తహసీల్దార్ జాహెద్‌పాషాను తిరుపతి పలుసార్లు కలిశాడు. దీని కోసం ముందుగా ₹50 వేలు లంచం ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేయడంతో మూడు విడుతల్లో (₹15 వేలు, ₹20 వేలు, ₹15 వేలు) లంచం ముట్టచెప్పాడు. అయినా పని పూర్తి చేయకపోవడంతో పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో తిరుపతి, ఆయన తండ్రి మల్లయ్య రెండు సార్లు దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గత నెల 23న భూమిని ధరణిలో నమోదు చేసి ఆన్‌లైన్ చేయగా, పట్టా పాస్ పుస్తకం వచ్చింది. అయితే, బ్యాంక్ లోన్ కోసం లింక్ డాక్యుమెంట్ (పహాణీ నకల్) అవసరం కావడంతో తహసీల్దార్‌ను తిరుపతి సంప్రదించాడు. ₹10 వేలు లంచం ఇస్తేనే పని చేస్తానని తహసీల్దార్ చెప్పడంతో విసుగు చెందిన రైతు తిరుపతి రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు ప్రణాళిక వేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలోనే తహసీల్దార్ జాహెద్‌పాషా, చిన్నరాతపల్లి వీఆర్ఏ దాసరి మల్లేశం కొడుకు దాసరి ధర్మేందర్(విష్ణు), డ్రైవర్ అమ్జద్‌పాషా రైతు కాడం తిరుపతి నుంచి ₹10 వేలు లంచం తీసుకుంటుండగా వలపన్ని పట్టుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

లంచం కావాలని వేధించిండు

నాకు కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పందిల్ల శివారులో 28 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమి మ్యుటేషన్ కోసం తహసీల్దార్‌కు గతంలో ₹50వేలు లంచం ఇచ్చినా పని చేయలేదు. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ అయింది. పట్టా పాస్ పుస్తకం వచ్చింది. బ్యాంక్ లోన్ కోసం పహాణీ నకల్ కావాలని తహసీల్దార్‌ను సంప్రదిస్తే మళ్లీ ₹10వేలు లంచం డిమాండ్ చేసిండు. ఆయన డ్రైవర్ అమ్జద్‌పాషా, తహసీల్దార్ ఆఫీసులో పనిచేసే దాసరి ధర్మేందర్(విష్ణు)కు ₹10 వేలు ఇవ్వాలని చెప్పిండు. అంత డబ్బు తనవద్ద లేదని, ఎంత చెప్పినా వినిపించుకోలేదు. డబ్బులు కావాలని వేధించాడు. ఆ బాధ భరించలేక రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులను కలిశా. అవినీతి తహసీల్దార్‌ను ఏసీబీకి పట్టించా.

- తిరుపతి, రైతు

నకిలీ ఇచ్చి అసలు దోపిడీ

- నోట్లు మారుస్తుండగా లాక్కొని పరారు• ఇది ఆ ముఠా పథకం
- ఏడాది కాలంగా అమలు • తాజాగా గుట్టురట్టు చేసిన పోలీసులు
- ఆరుగురు నిందితుల అరెస్ట్

ముఠాసభ్యుల అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

పట్టుబడిన నకిలీ కరెన్సీ, సెల్‌ఫోన్లు

మెట్‌పల్లి, ఆగస్టు 3 : ఈజీ మనీ కోసం ఆ ఆరుగురు ముఠాగా ఏర్పడి, అడ్డదారులు తొక్కారు. అసలు లక్షకు 5లక్షల నకిలీ నోట్లు ఇస్తామని ఎరవేసి, ఆపై బైక్‌పై వచ్చి అసలు నోట్లు లాక్కొని పరారవుతారు. ఇలా ఏడాది కాలంగా దోపిడీకి పాల్పడుతుండగా.. ఎట్టకేలకు ఆరుగురు నిందితులు పోలీసులకు చిక్కారు. మెట్‌పల్లి పోలీస్ సబ్ డివిజనల్ అధికారి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నకిలీ కరెన్సీ ముఠా సభ్యుల అరెస్ట్‌ను చూపారు. డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లాకు చెందిన సదాల సంజీవ్, బిట్టు శివకుమార్, నిర్మల్ జిల్లా మగ్గిడి కిషన్, కలకుంట్ల గంగారాం, బొంగురాల మల్లయ్య ఉరఫ్ పులి, మునిమానికల అశోక్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈజీ మనీకి అలవాటు పడి, తాము సేకరించిన నకిలీ నోట్లతో దందా చేయాలని అనుకున్నారు. నకిలీ ₹5 లక్షల నోట్లకు అసలు ₹లక్ష తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. కారులో ఇద్దరు, బైకుపై ఇద్దరేసి చొప్పున నోట్ల మార్పిడికి వెళ్లాలని, కారులో నోట్లు మారుస్తున్నప్పుడు బైక్‌పై ఇద్దరు వచ్చి 'పోలీస్, పోలీస్' అని అరిచి ఒరిజినల్ నోట్ల కట్టలను ఇస్తున్న వ్యక్తి నుంచి లాక్కొని పారిపోవాలని పథకం వేశారు. అలా అయితే బాధితులు పోలీసులకు కూడా చెప్పుకోలేరని భావించి, ఈ పథకాన్ని ఏడాది నుంచి అమలు చేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ముగ్గురిని, ధర్మపురిలో ఒకరిని, కరీంనగర్‌లో ఒకరిని, జన్నారంలో ఒకరిని, జగిత్యాలలో ఒకరిని నమ్మించి, అసలు ₹10 లక్షల వరకు పోగేసుకున్నారు. ఈ నెల ఒకటిన రాత్రి మెట్‌పల్లి మండలం చౌలమద్ది శివారులోని పెద్దగుండు సమీపంలో దాబా యజమాని రాజేందర్‌కు నకిలీ ₹5 లక్షలు ఇస్తామని చెప్పి అసలు ₹లక్ష లాక్కొని పారిపోయారు. ఈ నెల 2న రాజేందర్ మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. స్థానిక సీఐ నిరంజన్‌రెడ్డి నేతృత్వంతో ఎస్ఐలు చిరంజీవి, రాజు, పోలీస్ సిబ్బంది ఈ ముఠా కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపేటలో సమీపంలోని వీరేంద్ర దాబాలో ఆరుగురు సభ్యులు ఉన్నట్టు సమాచారం అందడంతో హుటాహుటిన అక్కడికి చేరుకొని, నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7 లక్షల నకిలీ నోట్లు (1400), ఒక నెక్సాన్ కారు, పల్సర్, సెల్‌ఫోన్లను, ₹5,050 నగదును స్వాధీనం చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి, మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నకిలీ ముఠాసభ్యులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నిరంజన్‌రెడ్డిని, పోలీస్‌సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

జగిత్యాల డీఎంవోకు మూడు జిల్లాల బాధ్యతలు

ప్రకాశ్, డీఎంవో

కరీంనగర్ ముకరంపుర, ఆగస్టు 3 : జగిత్యాల జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారిగా పని చేస్తున్న డీ ప్రకాశ్‌కు అదనంగా మూడు జిల్లాల బాధ్యతలు అప్పగిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు కరీంనగర్ డీఎంవోగా ఉన్న పద్మావతి వరంగల్ ఆర్డీడీగా బదిలీ కాగా, ఆమె స్థానంలో ప్రకాశ్‌కు కరీంనగర్ ఇన్‌చార్జి డీఎంవోతో పాటు పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల డీఎంవోగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కరీంనగర్ ఇన్‌చార్జి డీఎంవోగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా డీఎంవోగా పనిచేసిన పీ ప్రవీణ్ కుమార్ జూనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్‌గా కామారెడ్డి డీఎంవోకు బదిలీ అయ్యారు.

మామిడాలపల్లి విద్యార్థినికి అమెరికా విద్య

మూల పావని

వీణవంక, ఆగస్టు 3 : సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తున్న సరస్వతీ పుత్రికకు అమెరికాలో ఉచితంగా మాస్టర్స్ చేసే అవకాశం వచ్చింది. ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ నుంచి అమెరికాలో ఉన్నత విద్య (మాస్టర్స్) అభ్యసించడానికి నలుగురు విద్యార్థులను ఫెలోషిప్‌తో ఎంపిక చేయగా, అందులో కొండాలక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ పూర్తిచేసిన వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామానికి చెందిన మూల పావని కూడా ఉన్నది. ఆ యువతి ఇంటర్ చదివిన తర్వాత పోస్టల్‌శాఖలో ఉద్యోగానికి ఎంపికైనా వెళ్లకుండా ఎంసెట్ రాసింది. హైదరాబాద్ కొండాలక్ష్మణ్ యూనివర్సిటీలో బీఎస్సీ హార్టికల్చర్‌లో సీటు సాధించింది. 2023-2024లో ఉత్తమ ప్రతిభ కనబరిచి డిగ్రీ పూర్తి చేసింది. ప్రస్తుతం అమెరికాలోని అబరాన్ యూనివర్సిటీలో మాస్టర్స్ కోసం దరఖాస్తు చేసుకొని సీటు సాధించింది. మాస్టర్స్ పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం హైదరాబాద్‌లో వెల్లడించారు. రెండేళ్లకు ప్రభుత్వం ₹55.50 లక్షలు ఖర్చు చేయనుండగా, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రణాళిక సరే.. పైసలేవి?

- రేపటి నుంచి గ్రామాల్లో 'స్వచ్ఛదనం- పచ్చదనం'
- నిర్వహణకు నిధులివ్వని సర్కారు!
- ఖాళీగా పంచాయతీ ఖజానాలు
- కార్యదర్శులపైనే ఆర్థిక భారం!
- పనులు చేయాలని అధికారుల ఒత్తిడి!
- ఇప్పటికే అప్పులు చేశామని వాపోతున్న సెక్రెటరీలు

ప్రభుత్వం ఒక కార్యక్రమం అమలు చేసే ముందే అందుకు అవసరమైన నిధులను సమకూరుస్తుంది. ఆ తర్వాతే కార్యాచరణ మొదలు పెడుతున్నది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. ఈ నెల 5 నుంచి 9 వరకు 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమాన్ని గ్రామాల్లో అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చినా.. నిర్వహణకు ఒక్క పైసా ఇవ్వకపోవడం, ఏ పంచాయతీలో చూసినా నిధులు లేక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆ కార్యక్రమం కార్యదర్శులకు భారంగా మారుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఇటీవల బదిలీ అయిన సెక్రటరీలు ఇంతకు ముందున్న గ్రామాల్లో అప్పులు చేసిన పనుల బిల్లులు కూడా రాలేదు. ఇపుడు కొత్త పంచాయతీల్లోనూ తిరిగి ఇదే పరిస్థితి ఎదురవక తప్పదనే ఆందోళనలో కనిపిస్తున్నది. ప్రభుత్వ ఆదేశాలతో పనులు చేయాలని ఒత్తిడి తెస్తున్న అధికారులు.. జీపీల్లో నిధులు ఉన్నాయా.. లేవా..? అనే విషయాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని తెలుస్తున్నది.

కరీంనగర్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు ఐదు రోజుల పాటు గ్రామాల్లో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ఇది పూర్తయిన తర్వాత ప్రతి 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు నాలుగైదు రోజులుగా కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, జిల్లా అధికారులను సమయాత్తం చేస్తున్నది. అయితే అందుకు అవసరమైన నిధులను మాత్రం ఇవ్వలేదని తెలిసింది. గతంలో వానకాలానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు తీసుకునేది. అందుకు అవసరమైన నిధులను పల్లె ప్రగతి కింద విడుదల చేసేది. కొన్ని సందర్భాల్లో నిధులు ఇచ్చే పరిస్థితి లేకున్నా పంచాయతీలకు పెండింగ్ నిధులైనా విడుదల చేసి వాటిని వాడుకోవాలని సూచించేది. కానీ, ఇపుడు అలాంటి పరిస్థితి కూడా లేక పోవడంతో భారమంతా కార్యదర్శులపైనే పడనున్నది.

పైసలు లేకుంటే పనులెట్లా..?

ఫిబ్రవరిలో సర్పంచుల పదవీ కాలం ముగియగా, కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదలను నిలిపేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు ఇవ్వడం లేదు. ఇటీవల ఎస్ఎఫ్‌సీ గ్రాంట్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం సిబ్బంది జీత భత్యాలు చెల్లించాలని సూచించింది. దీంతో మే నెల వరకు ఉన్న వేతన బకాయిలను కార్యదర్శులు చెల్లించారు. ఇంటి పన్నులు, నల్లా బిల్లులు కూడా సరిగ్గా వసూలు కాకపోవడంలో పంచాయతీల్లో జనరల్ ఫండ్ కూడా లేకుండా పోయింది. ప్రభుత్వం నుంచి గ్రాంట్లు రాక, స్థానికంగా పన్నులు వసూలుకాక పంచాయతీ ఖజానాలు పూర్తిగా నిండుకునే పరిస్థితి ఏర్పడింది. కొన్ని మేజర్ పంచాయతీలు జనరల్ ఫండ్‌తో నెట్టుకొస్తున్నా చిన్న పంచాయతీలు మాత్రం ఆర్థిక భారంలో చిక్కుకుని ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. మేజర్, మైనర్ అనే తేడా లేకుండా అనేక పంచాయతీల్లో పారిశుధ్యలోపం ఏర్పడుతున్నది. పారిశుధ్య నిర్వహణ కోసం గత ప్రభుత్వం సమకూర్చిన ట్రాక్టర్లలో డీజిల్ లేక అనేక పంచాయతీల్లో మూలన పడ్డాయి. ప్రతి రోజూ చెత్తను తీసుకెళ్లి డంప్‌యార్డులో వేసే ఆ ట్రాక్టర్లు ఇప్పుడు వీధుల్లో తిరగకపోవడంతో చెత్త కుప్పలతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో కార్యదర్శులు సొంత డబ్బులతో ట్రాక్టర్లను నిర్వహిస్తున్నారు. ₹30వేల నుంచి ₹లక్ష, ₹5లక్షల వరకు ఒక్కో గ్రామంపై ఖర్చుచేసి ఉన్నారు. ఈ బిల్లులు రాకముందే పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేశారు. ఇప్పుడు ఆ బిల్లులు తీసుకునేది ఎలాగని కార్యదర్శులు మదన పడుతున్న నేపథ్యంలో 'స్వచ్ఛదనం- పచ్చదనం' ప్రభుత్వం ముందుకు తెచ్చింది. అందుకు అవసరమైన నిధులను మాత్రం సమకూర్చడం లేదని తెలిసింది.

భారమంతా కార్యదర్శులపైనే

ఓ పక్క పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతున్నది. సర్పంచుల పదవీ కాలం ముగిసి ఎనిమిది నెలలవుతుండగా, జీపీల నిర్వహణ భారమంతా కార్యదర్శులపైనే పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్లు రాక, స్థానికంగా బిల్లులు వసూలుకాక పోవడంతో ఖజానాలో నిధులు లేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో వసూలైన పన్నులు, బిల్లులు ట్రెజరీలో జమచేస్తే తిరిగి తీసుకోవడానికి వీలు లేకుండా ఫ్రీజింగ్ కొనసాగుతున్నది. ఏ చిన్న అవసరం ఏర్పడినా కార్యదర్శులు పంచాయతీ నిధుల కంటే తమ జేబు నుంచి పెట్టినవే ఎక్కువని తెలుస్తున్నది. నిధులు లేని జీపీల్లో పనుల నిర్వహణకు సెక్రెటరీలు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే అప్పుల భారం మోయలేక పోతున్న తరుణంలో మూలిగే నక్కపై తాటికాయ పడినట్టు బదిలీలు వారికి శాపంగా మారాయి. తాము పనిచేసిన పాత పంచాయతీల్లో అనేక మందికి బిల్లులు రావాల్సి ఉందని, అక్కడి నుంచి బదిలీ అయిన తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

ప్రతి దానికి పైసలే అవసరం

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు చేపట్టిన 'స్వచ్ఛదనం- పచ్చదనం' నిర్వహించాలంటే ప్రతి దానికీ నిధులు అవసరముంటుంది. ప్రభుత్వం మాత్రం ఎలాంటి నిధులు ఇప్పటి వరకు ఇవ్వలేదు. కానీ, సోమవారం నుంచి ఐదు రోజులపాటు కార్యక్రమాలు ఎలా నిర్వహించేదని కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. గ్రామ పంచాయతీల వారీగా బృందాలను ఏర్పాటు చేయడం, కార్యక్రమానికి ముందే ప్రభుత్వ కార్యాలయాలపై వాల్ పేయింట్ చేయించడం, విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించడం, వసతి గృహాలు, పాఠశాల ఆవరణల్లో వర్షపు నీరు నిల్వకుండా చేయడం, తడి పొడి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు తరలించడం, ప్రతి రోజూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం, ఉన్న సిబ్బంది సరిపోకుంటే అదనంగా కూలీలను ఏర్పాటు చేసుకోవడం, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు వంటివి సేకరించడం, ప్రతి రోజూ మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. ఏది చేయాలన్నా సరిపడా నిధులు అవసరముంటుంది. పంచాయతీల్లో నిధులు లేని అనేక చోట్ల తమపైనే భారం పడుతుందని కార్యదర్శులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీల పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వం సరిపడా నిధులు సమకూరిస్తే ఐదు రోజుల ప్రణాళికను విజయవంతంగా అమలు చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

పంచాయతీలకు నిధులు వస్తాయి

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి ప్రభుత్వం నిధులు ఇస్తుంది. గ్రీనరీకి సంబంధించిన నిధులు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు విడుదల చేశారు. ఇతర కార్యక్రమాల కోసం పంచాయతీల నుంచి రిక్వరీ మెంట్ తీసుకున్నారు. ఇప్పటి వరకైతే ప్రొసీడింగ్స్ రాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే అవకాశం తప్పక ఉంటుంది. చాలా పంచాయతీల్లో నిధులు కూడా ఉన్నాయి.

- రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి (కరీంనగర్)

సైబర్ వలలో వైద్యుడు

- ₹72 లక్షలకుపైగా కాజేసిన కేటుగాళ్లు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

మెట్‌పల్లి, ఆగస్టు3 : సైబర్ నేరగాళ్ల వలలో పడి ఓ పిల్లల వైద్యుడు నిలువుదోపిడీకి గురయ్యాడు. స్టాక్‌మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేద్దామన్న ఆశతో నిండా మునిగాడు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ₹72లక్షలకుపైగా పోగొట్టుకొని లబోదిబోమంటున్నాడు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ పిల్లల వైద్యుడికి స్టాక్ మార్కెట్ (షేర్‌మార్కెట్)లో పెట్టుబడి పెట్టడం అలవాటు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి అనేకసార్లు లాభాలు పొందాడు. ఇదే క్రమంలో మే 18న స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేందుకు ఇన్‌స్టాగ్రామ్‌లోకి వెళ్లి ఒక లింకును తెరిచాడు. ఆ వెంటనే ఇన్వెస్ట్ చేయాలనుకుంటే ఏసీమాక్స్ అనే అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, 'ఆక్సెల్ స్టూడెంట్ సీ 95 గ్రూప్‌లో చేరండంటూ ఒక లింక్ వాట్సాప్‌కు వచ్చింది. ఆ లింక్ ఓపెన్ చేసి ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించాడు. అదే నెల 22 నుంచి విడుతల వారీగా మొత్తం ₹22 లక్షలు పెట్టుబడి పెట్టాడు. తర్వాత ఐపీవో సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని వాట్సాప్ కాల్ రావడంతో తన దగ్గర డబ్బులు లేవని, సబ్‌స్క్రైబ్ చేయలేనని బదులిచ్చాడు. దాంతో ఏం కాదు, జమ చేసిన డబ్బులు సరిపోతాయని నమ్మించడంతో సదరు వైద్యుడు ఐపీవో సబ్‌స్క్రైబ్ చేశాడు. ఆ వెంటనే ₹50 లక్షలు కట్టాలని, లేదంటే క్రెడిట్ స్కోర్ పడిపోతుందని, లైఫ్ రిస్క్‌లో పడుతుందని, కనీసం ఫ్లైట్ ట్రావెల్ టికెట్ కూడా బుక్ చేసుకోలేరని కాలర్ చెప్పడంతో తన వద్ద ఉన్న కొంత, అప్పు కొంత కలిపి ₹50 లక్షలు కట్టాడు. ఆ తర్వాత జూన్ 26న ఐపీవోలో పెట్టిన పెట్టుబడి లాభం ₹1.27 కోట్లకు పెరిగిందని, మళ్లీ ఇంకో ఐపీవో సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని వాట్సాప్ కాల్ వచ్చింది. ఇక తన వద్ద డబ్బు లేదని, తన డబ్బులు విత్‌డ్రా చేసుకుంటానని చెప్పాడు. అలాగైతే 20 శాతం సర్వీస్ టాక్స్ చెల్లించాలని, విత్ డ్రా చేసుకునే మొత్తం(₹1.27 కోట్ల)లో 30 శాతం డిపాజిట్ చేయాలని చేయాలనడంతో కంగుతిన్నాడు. తీరా మోసపోయానని గ్రహించి బాధితుడు గత నెల 4న సైబర్‌క్రైమ్ విభాగానికి, 13న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నీళ్లివ్వకుంటే ఉద్యమం తప్పదు

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

తాటిపెల్లి వద్ద ఎస్సారెస్పీ కెనాల్ పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్, లోకబాపురెడ్డి, నాయకులు

జగిత్యాల రూరల్, ఆగస్టు 3 : రైతులకు ఎస్సారెస్పీ నుంచి నీళ్లు ఇవ్వకుంటే ఉద్యమం తప్పదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ హెచ్చరించారు. శనివారం జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి కెనాల్, మోరపెల్లి, చలిగల్, రాయికల్ మండలంలోని సింగరావుపేట, శ్రీరాంనగర్, అల్లీపూర్, కిష్టంపేట, ఉప్పుమడుగు, అయోద్య, కుర్మపల్లె గ్రామాల్లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డితో పర్యటించారు. కెనాళ్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సారెస్పీ కెనాల్ నిర్వహణ అస్తవ్యస్తంగా, అధ్వాన్నంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జూన్‌లోనే నీటిని విడుదల చేసిందని, ప్రస్తుతం రైతుల గొంతు ఎండిపోతున్నదని వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. రాయికల్ మండలంలోని కుర్మపల్లిలో సుమారు 200 ఎకరాల్లో పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయకుంటే రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, ప్యాక్స్ చైర్మన్ రాజలింగం, పట్టణ అధ్యక్షుడు అనిల్, గ్రామశాఖ అధ్యక్షుడు రత్నాకర్ రావు, మాజీ వైస్ఎంపీపీ మహేశ్వర్ రావు, కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి, మహేశ్ గౌడ్, సువర్ణ, సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్లు ఉదయశ్రీ, నాగేశ్వర్ రావు, వైస్ చైర్మన్ బర్కం మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

నందిమేడారంలోని నంది పంప్ హౌస్ డెలివరీ సిస్టర్నల ద్వారా ఎగిసి పడుతున్న జలాలు

ధర్మారం/ రామడుగు/ బోయినపల్లి, ఆగస్టు 3 : ఎల్లంపల్లి ప్రాజెక్ట్ లింక్-2లోని నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లలో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గత నెల 27 నుంచి శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌కు చేరిన నీటిని ఎత్తిపోస్తుండగా, శనివారం 4మోటర్ల ద్వారా కొనసాగించారు. 2,3,5,7 మోటర్ల ద్వారా 3,150క్యూసెక్కుల చొప్పున 12,600 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఈ రిజర్వాయర్ 10 గేట్లను ఎత్తడంతో గ్రావిటీ కాల్వ ద్వారా జంట సొరంగాలకు చేరి అక్కడి నుంచి 7,8ప్యాకేజీలలోని కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. అక్కడి 1,3,4,5 మోటర్ల ద్వారా క్యూసెక్కుల చొప్పున 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి అప్రోచ్ కెనాల్ నుంచి వరద కాలువకు, అక్కడి నుంచి శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. కాగా, ఎస్సారార్ జలాశయంలో శనివారం వరకు 14.062 టీఎంసీల నీటి నిలువ ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 13,795 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పేర్కొన్నారు.

దానంపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ టౌన్ ఏసీపీకి ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ : టౌన్ ఏసీపీ కార్యాలయానికి ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ రాంనగర్, ఆగస్టు 3 : అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీ